క్యాంప్ కార్యాలయంలో డీలర్ల సమస్యలపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి
- రేషన్ డీలర్లకు నెలకు రూ.5 వేలు

మల్కాజిగిరి, సెప్టెంబర్ 3: రేషన్ షాపుల డీలర్ల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో రాష్ట్రంలో మొదటిసారిగా నియోజక వర్గంలోని రేషన్ డీలర్ల సమస్యలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో మూడు నెలలు రేషన్ తీసుకోకుంటే కార్డులను రద్దు చేశారని, వాటన్నిటిని పునరుద్ధరించాలన్నారు. తెల్ల రేషన్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అర్హులకు అందడంలేని అన్నారు. అంత్యోదయ కార్డులను దివ్యాంగులకు, వితంతువులు, హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు, డయాలసిస్ రోగులు, కుష్ఠు వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం మంజూరు చేయాలని అన్నారు. కుటుంబంలో పుట్టిన పిల్లల పేర్లు, కొత్తగా పెండ్లి అయిన అమ్మాయిల పేర్లను కార్డులో చేర్చాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం రేషన్ డీలర్లకు నెలకు రూ.5000 ఇవ్వాలని అన్నారు. వారికి ఇచ్చే కమిషన్‌ను పెంచాలని, గోడౌన్‌ల నుంచి వచ్చి సరకుల తూకంలో వ్యత్యాసాలు లేకుండా సరకుల సంచులను డీలర్లకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ బాలరాజు, డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల సంతోష్ కుమార్, కార్పొరేటర్లు సునీతా రాము యాదవ్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, డీలర్లు బాల్‌రెడ్డి, చక్రధర్, రమేష్ సింగ్, శివ కుమార్, కరుణానిధి, వెంకట హరి, నాయకులు జీకే హన్మంతరావు, కరంచంద్, రమేష్, రాయు యాదవ్, మధుసూదన్‌రెడ్డి, పరమేశ్, భాగ్యనందా రావు, వంశీ ముదిరాజ్, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యకు మించింది లేదు

- దేశానికి అన్నం పెట్టగలం అని నిరూపించాం
- కేంద్రీయ ఉప కులపతి డా.జగదీశ్వర్ రావు

సమావేశంలో మాట్లాడుతున్న ఉప కులపతి డా. జగదీశ్వర్ రావు

వ్యవసాయ యూనివర్సిటీ , సెప్టెంబర్ 3: భారత దేశంలో వ్యవసాయ విద్యను మించింది మరొకటి లేదని కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉప కుల పతి డా.బి.జగదీశ్వర్ రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో యూనివర్సిటీ 10 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో వ్యవసాయ, అనుబంధ రంగాలపైనే ఎక్కువ కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయని, అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల నుంచే రావడం అభినందనీయమన్నారు. వ్యవసాయ విద్య ఇచ్చిన తృప్తి మరొకటి ఇవ్వదని గుర్తుచేశారు. 'గుడ్ క్వాలిటీ ఎడ్యుకేషన్ ఈజ్ ద సొల్యూషన్' అనే అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. విద్య, విజ్ఞానం అనేవి చాలా పదునైన అస్త్రాలని, వాటిలోనే సవాళ్లను పరిష్కరించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. దేశంలో నూతనంగా ప్రవేశ పెట్టిన విద్యా విధానం సరికొత్త నిర్వచనం ఇచ్చిందన్నారు. దానిని విద్యార్థులు ప్రయోగాత్మకంగా నేర్చుకునే అవకాశం ఉందన్నారు. సాగులో ఏ దేశంలో లేని మానవ వనరులు, సాగుకు అనువైన వాతావరణ పరిస్థితులు, నేలలు, మన దేశంలోనే అధికంగా ఉన్నాయని తెలిపారు. దేశంలో మహిళా శక్తి అన్ని రంగాలలో రాణిస్తోందని, ప్రధానంగా వ్యవసాయ రంగంలో ఆమె పాత్ర ఎంతో కీలకమన్నారు. ఏ దేశంలో లేని విధంగా కుటుంబ సంస్కరణలు, ఉమ్మడి కుటుంబాలు ఇప్పటికీ ఉన్నాయని, అందువల్లే నాటి నుంచి ఇప్పటికీ వ్యవసాయ రంగంలో మన దేశానికి ప్రాధాన్యత ఉందన్నారు. సాగు మాసపద్ధతిన వీడి అధునాతన టెక్నాలజీని ఉపయోగించుకుని మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పరిశోధనా, విస్తరణ, విద్యా, విభాగాలలో విప్లవాత్మక మార్పునకు నాంది అని, మీరంతా అందుకు అనుగుణంగా పనిచేసి మంచి ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 2014లో ఏర్పాటు నుంచి ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం జాతీయ స్థాయిలో అనేక ఉన్నత శిఖరాల్ని అధిరోహించిందని వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఏపీసీ, అగ్రివర్సిటీ ఉప కులపతి డా.రఘునందన్ రావు అన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డా. రఘురామిరెడ్డి మాట్లాడుతూ, పదేండ్లలో ఐదు నూతన వ్యవసాయ కళాశాలలు, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల, నాలుగు వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాలల్ని ప్రారంభించిందన్నారు. విద్యార్థుల సీట్ల సంఖ్యను 1360 కి పెంచిందన్నారు. అమెరికాలోని అబర్న్ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ లోన్ పీజీ కోర్సు అభ్యసించేందుకు విద్యార్థులకు ఓవర్సీస్ ఫెలోషిప్ అందించామన్నారు. పీజేటీఎస్ఏయూ 37వ స్థానాన్ని సాధించిందన్నారు. ప్రధాన పంటల్లో ఇప్పటి వరకు 67 నూతన వంగడాలను విడుదల చేశామన్నారు. యూనివర్సిటీ రూపొందించిన తెలంగాణ సోనా వరి వంగడం జాతీయ స్థాయిలో భాగా ఆదరణ పొందిందని గుర్తుచేశారు. అనంతరం, ప్రతిభ కనబర్చిన ఆదర్శ రైతులకు, వ్యవసాయ శాస్త్రవేత్తలకు, అధికారులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు.

వరద బాధితులకు నేను సైతం..

సీఎం సహాయనిధికి రూ.3వేలు అందించిన బాలిక

మహబూబాబాద్ రూరల్ : వరద ముంపు బాధితులను ఆదుకోవాలనే ఆలోచనతో తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.3వేలను మంగళవారం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సీఎం సహాయనిధికి అందించింది పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయిసింధు. ఈ సందర్భంగా సీఎం సహా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ బాలికను అభినందించారు.

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి

ఏఐఆర్ఆర్ఎఫ్ అధ్యక్షులు శ్రీధర్ డిమాండ్

అడ్డగుట్ట, సెప్టెంబర్ 3: కొత్త పెన్షన్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఆల్ ఇండియా రిట్రైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్(ఏఐఆర్ఆర్ఎఫ్) జాతీయ అధ్యక్షుడు, నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎన్ఎన్‌సీపీఏ) ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.శ్రీధర్ డిమాండ్ చేశారు. చిలకలగూడలోని ఏఐఆర్ఆర్ఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్ర క్యాబినెట్ యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)పై తీసుకున్న నిర్ణయం ద్వారా 1.1.2004 తర్వాత రిక్రూట్ అయిన ఉద్యోగులపై పక్షపాత వైఖరిని కొనసాగిస్తున్నట్లు కనిపిస్తుందని, ఇది పూర్తిగా సుప్రీంకోర్టు ఇచ్చిన నకారాతీర్పుకు వ్యతిరేకంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పబ్లిక్ సెక్టార్, ప్రైవేట్ సెక్టార్ కార్మికులు కొత్త పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారని, వారంతా పాత పెన్షన్ విధానమే కావాలని డిమాండ్ చేస్తున్నారని ఆయన తెలిపారు. పోరాటాల ఒత్తిడి ద్వారా కొన్ని రాష్ట్రాలు ఎన్‌పీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారుస్తామని నిర్ణయించారని, కేంద్ర ప్రభుత్వం కొన్ని రాష్ట్రాలపై కఠిన వైఖరిని అవలంభిస్తుందని, అది సరైంది కాదని ఆయన పేర్కొన్నారు. 'కొత్త పెన్షన్ విధానం వద్దు – పాత పెన్షన్ విధానమే ముద్దు' అనే నినాదంతో ఈ నెల 13న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు ఆయన తెలియజేశారు.

పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

ముషీరాబాద్, సెప్టెంబర్ 3: ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా జి.అనసూయ, ప్రధాన కార్యదర్శిగా అండే మంగళప్రద, ఉపాధ్యక్షులుగా ఎం.జ్యోతి, సరిత, కె.జ్యోతి, కార్యదర్శులు గీత, ఆర్.సీత, కోశాధికారిగా జానకితోపాటు 16మందిని కమిటీ ప్రతినిధులుగా ఎన్నుకున్నట్లు కమిటీ అధ్యక్షురాలు అనసూయ తెలిపారు. ఆమె మాట్లాడుతూ మద్యపానం, గృహ హింస, అశ్లీల సంస్కృతికి వ్యతిరేకంగా పోరాటం చేయనున్నట్లు తెలిపారు. ఫాసిస్టు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించనున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని పీఓడబ్ల్యూ మాజీ అధ్యక్షురాలు ఝాన్సీ డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీల నుంచి తప్పించుకుంటామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వెల్వర్తి గ్రామస్తుల వినతి

ఎమ్మెల్యే కు వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

వలిగొండ, సెప్టెంబర్ 3 : మండలంలోని వెల్వర్తి గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉక్కుర్తి స్వామి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న నారి ముత్యాలుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.10లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎడవెళ్లి యాదగిరి, కల్కూరి చంద్రయ్య, బైరు సైదులు, పిట్టల గణేశ్, పరకాల ముత్యాలు, నారి నవీన్ పాల్గొన్నారు.

మాజీ మంత్రులపై కాంగ్రెస్ దాడి హేయం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రమేశ్‌గౌడ్

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 3 : ఖమ్మం జిల్లాలో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడి హేయమైన చర్య అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమాసు రమేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వరద బాధితులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించేందుకు వచ్చిన మాజీ మంత్రులపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని, దాడిలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ గూండాల దాడులు తీవ్రమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అరాచకాలను తెలంగాణ సమాజం గమనిస్తుందని, రాబోయే రోజుల్లో గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

కరాటేలో లిటిల్ బర్డ్స్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

బీబీనగర్, సెప్టెంబర్ 3 : ఓరుగల్లు డ్రాగన్ స్కూల్ ఆఫ్ జపాన్ కరాటే ఆధ్వర్యంలో ఖాజీపేటలో నిర్వహించిన నేషనల్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ – 2024 పోటీల్లో మండల కేంద్రంలోని లిటిల్ బర్డ్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో విద్యార్థులు కట్ట సుమిత్, గంజి తేజఃప్రకాశ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మల్లగారి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుక్క కాశీవిశ్వనాథ్, ఉపాధ్యాయులు రామ్మూర్తి, బాల స్వామి, మంజుల, మమత, దీప జోసెఫ్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ముక్తాపూర్ పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 3 : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ ప్రాథమిక పాఠశాలకు చెన్నకేశవస్వామి దేవాలయ మాజీ చైర్మన్ నక్కల రాజిరెడ్డి రూ.20వేల విలువ గల స్కానర్ ప్రింటర్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. ప్రింటర్ బహూకరించిన రాజిరెడ్డిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దారెడ్డి మల్లారెడ్డి, మునుకుంట్ల బాలచంద్రంగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుబాబు, అధ్యాపకులు పద్మ, కృష్ణ, లక్ష్మి, సంగీత, అఖిల పాల్గొన్నారు.

తక్షణమే ఉపకార వేతనాలు పెంచాలి

- బీసీ విద్యార్థి రాష్ట్ర సదస్సులో ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ కోదండరామ్

అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, కోదండరామ్, హనుమంతరావు, గుజ్జ కృష్ణ

రవీంద్రభారతి, సెప్టెంబర్ 3: పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఇచ్చే ఉపకార వేతనాలను తక్షణమే పెంచాలని, ఈ డిమాండ్ న్యాయ సమ్మతమేనని, విద్యార్థులకు ఇచ్చే ఉపకార వేతనాలను కూడా పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో బీసీ విద్యార్థి రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల సదస్సును మంగళవారం నిర్వహించారు. సభకు బీసీ విద్యార్థి సంఘం నాయకుడు వేముల రామకృష్ణ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎంపీ హనుమంతరావులు హాజరయ్యారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రెండేళ్ళుగా బకాయి ఉన్న రూ.4.500 కోట్ల ఫీజులను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. విద్యార్థుల మెస్ చార్జీలను నెలకు రూ.1500 నుంచి 3000లకు పెంచాలని, డే స్కాలర్‌షిప్స్‌ను ఇంటర్, డిగ్రీ కోర్సులకు రూ.10 వేల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి విదేశీ విద్యానిధి మంజూరు చేయాలన్నారు.ఎస్సీ,ఎస్టీ,బీసీ రిజర్వేషన్లను ప్రైవేట్ యూనివర్సిటీలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిగ్రీ ఇంటర్ తదితర విద్యార్థుల మొత్తం ఫీజులు పునరుద్ధరించాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కాలేజీ హాస్టళ్ళు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వాటికి సొంత భవనాలు నిర్మించాలన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఇచ్చే ఉపకార వేతనాలు సరిపోవడం లేదని, తక్షణమే వాటిని పెంచాలని, ఈ డిమాండ్ న్యాయ సమ్మతమేనని తన వంతు బాధ్యతగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ ప్రభుత్వం బీసీల పట్ల చిత్తశుద్ధితో ఉందని మీ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, బీసీ నేత ఎన్.వెంకటేశ్, జి.సత్యం, నందగోపాల్, అంజి, రాజ్ కుమార్, మల్లేశ్ యాదవ్, రఘుపతి, రాములు యాదవ్, రాఘవేంద్ర, సతీశ్, లక్ష్మినారాయణ, రామలింగం, ప్రభాకర్, రాజు, కోటేశ్వరి పాల్గొన్నారు.

గాంధీలో మౌలిక వసతుల కల్పనకు కృషి

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 3: పేదలకు మెరుగైన వైద్య సేవలందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానలో ఆయన అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ముందుగా సూపరింటెండెంట్ చాంబర్‌లో అధికారులతో పలు అంశాలపై చర్చించారు. బయటి రోగుల విభాగం, ఐసీయూ, క్యాజువాలిటి, టీఎంటీ, జనరల్ మెడిసిన్ వార్డులను ఆయన సందర్శించి, పలువురు రోగులతో మాట్లాడారు. రోగి సహాయకులు కింద కూర్చుని ఉండటాన్ని గమనించి, వారి కోసం తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, మీడియాతో మాట్లాడుతూ గాంధీ దవాఖానలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో సంతాన సాఫల్య కేంద్రంలో ఐవీఎఫ్ సేవలను త్వరలో ప్రారంభిస్తామని, అందులో ఎంబ్రియోలాజిస్ట్‌ను కూడా నియమిస్తామని అన్నారు. వైద్య విద్యార్థుల అభ్యర్థన మేరకు నూతన హాస్టల్ భవనాల నిర్మాణం కోసం రూ.79 కోట్లను ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిందని, త్వరలో తాను ఇక్కడికి వచ్చి నిర్మాణ పనులను ప్రారంభిస్తానన్నారు. సూపర్ స్పెషాలిటి రెండో యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదని తెలిపారు. ఈ పర్యటనలో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టీనా చోంగ్తూ, డీఎంఈ డాక్టర్ వాణి, దవాఖాన సూపరింటెండెంట్ డా.నీహెచ్ ఎన్ రాజకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డా. సుబోధ్ కుమార్, డా. సునీల్ కుమార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ డా. వాల్యా, డా. రవిశేఖర్‌రావు, ఆర్ఎంఓ డా.శేషాద్రి, పలు విభాగాల హెచ్ఓడీలు, టీఎస్ఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు పాల్గొన్నారు.

జిల్లా దవాఖానలో పర్యటన

సుల్తాన్‌బజార్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా పేర్కొన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని కింగ్ కోఠి జిల్లా దవాఖానాను ఆకస్మికంగా పర్యవేక్షించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్‌తో కలిసి దవాఖానను పర్యవేక్షించారు.

ప్రతిభ గల పేద విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి

నల్లకుంట ఎస్ఎల్ డయోగ్నోస్టిక్ సెంటర్ ఆవరణలో సెప్టెంబర్ 8న ఇంటర్వ్యూలు

మరిన్ని వివరాల కోసం సెల్ ఫోన్ నం. 95504 72190

వివరాలను వెల్లడిస్తున్న ట్రస్టు ప్రతినిధులు పి.రామకృష్ణ, కె.చిరంజీవరావు, వీవీకే ప్రసాద్, అరుణ్ కుమార్ సింగ్ తదితరులు

అంబర్‌పేట, సెప్టెంబర్ 3: శ్రీలక్ష్మీ వేంకటేశ్వర పోలాప్రగడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ (బీఏ, బీకాం, బీఎస్సీ, ఇంజనీరింగ్, ఫైన్ ఆర్ట్స్, మాస్టర్స్) కోర్సులలో ప్రభుత్వం నుంచి ఉచితంగా సీట్లు పొందిన పేద విద్యార్థులకు తమ ట్రస్టు ద్వారా ఉచితంగా హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు పి.రామకృష్ణ, కె.చిరంజీవ రావు, వీవీకే ప్రసాద్, అరుణ్ కుమార్ సింగ్, పి.రాంచందర్, పి.శ్రీనివాసులు తెలిపారు. నల్లకుంటలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తమ ట్రస్టు ద్వారా 25 ఏండ్లుగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు నగరంలోని ఐదు ప్రాంతాలలో ఉచితంగా భోజన వసతి, బస్సు పాస్, ల్యాప్‌టాప్, వైపై వంటి సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. ఆర్థికంగా ఏ రకమైన ఆసరా లేక మంచి మార్కులు తెచ్చుకునే నిరుపేద విద్యార్థులు, తల్లీ లేదా తండ్రి లేని పేద విద్యార్థులకు ఈ సహాయం చేస్తున్నామన్నారు. నగరంలోని అమీన్‌పూర్(లింగంపల్లి), నేరెడ్‌మెట్, నారాపల్లి, సన్ సిటి (లంగర్‌హౌజ్), సుచిత్ర తదితర ప్రాంతాలలో ఐదుచోట్ల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరానికి సంబంధించి ఈ నెల 8వ తేదీ, ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నల్లకుంట శంకర్‌మఠం కూరగాయల మార్కెట్ లేన్‌లో గల ఎస్ఎల్ డయోగ్నస్టిక్ సెంటర్ ఆవరణలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని చెప్పారు. ఇంటర్వ్యూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతుందని, మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నం. 95504 72190లో సంప్రదించాలని కోరారు.

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

- హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్
- దీక్ష పదో రోజుకు చేరుకున్నా స్పందించని సర్కారు

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 3: కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్ పటేల్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష పదో రోజుకి చేరుకుంది. గాంధీ దవాఖానలో దీక్ష చేస్తున్న సిద్ధేశ్వర్‌ను మంగళవారం బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, తెలంగాణ జర్నలిస్టు ఫోరం, ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, ఓబీసీ జేఏసీ చైర్మన్ అవ్వారు వేణు, ఓబీసీ ఉద్యోగుల సమాఖ్య నాయకుడు దానకర్ణ చారి, సోషల్ జస్టిస్ పార్టీ ఇన్‌చార్జి కేవీ గౌడ్, బీసీ ఆజాద్ సంఘ్ అధ్యక్షుడు డి.మహేశ్ గౌడ్, అంబేద్కర్ అజాదీ సంఘం అధ్యక్షుడు కొంగర నరహరి, అఖిలపక్ష నాయకులు పరామర్శించి, తమ సంఘీభావం తెలిపారు. అనంతరం, వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం కోటా ఇచ్చాకనే ఎన్నికలకు వెళ్ళాలని డిమాండ్ చేశారు. వెంటనే సమగ్ర బీసీ జనాభా గణన చేపట్టాలని కోరుతున్నామన్నారు. పది రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఆరోగ్యం క్షీణిస్తున్నందున దీక్ష విరమించాలని వారు విజ్ఞప్తి చేశారు. అయితే, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేంత వరకు దీక్ష విరమించేది లేదని సిద్ధేశ్వర్ పటేల్ అన్నారు.

గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సిద్ధేశ్వర్‌ను పరామర్శించిన రాజారాం యాదవ్ తదితరులు

వరద సహాయక చర్యలు ముమ్మరం

కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): వరద ముంపు నివారణకు నాలా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి జోనల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కూకట్‌పల్లి జోన్‌లోని వరద ముంపు ప్రాంతాలైన మైసమ్మ చెరువు, ఐడీఎల్ చెరువు, సర్దార్ నగర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వరద ముంపు ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు. ఇక ముందు వరద ముంపునకు గురి కాకుండా నాలా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ముంపునకు గురైన కాలనీ వాసులకు రక్షిత తాగునీరు సరఫరా చేయాలని, దోమల నివారణకు ఏఎల్ఓ, ఫాగింగ్ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. వ్యాధులు ప్రబలకుండా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఐడీఎల్, మైసమ్మ చెరువుల వద్ద గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కమిషనర్ వెంట కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, ఎస్ఈ చిన్నా రెడ్డి, డీసీలు, పలు శాఖల అ